## గంగనీళ్ల జాతరను విజయవంతం చేయాలి

సారంగాపూర్, అక్టోబర్ 8 : గంగనీళ్ల జాతరను విజయవంతం చేయాలని అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ అయిటి చందు పిలుపునిచ్చారు. ఆదివారం సారంగాపూర్ మండలం అడెల్లి ఆలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే గంగనీళ్ల జాతరకు పెద్దసంఖ్యలో భక్తులు సంఖ్యలో తరలిరావాలన్నారు. శనివారం అడెల్లి దేవస్థానం నుంచి అమ్మవారి ఆభరణాలు గంగా స్నానానికి బయలుదేరి అడెల్లి, సారంగాపూర్, యాకర్‌పల్లి, వంజర్ గ్రామాల మీదుగా వెళ్లి దిలావర్‌పూర్ మండలం బన్సపెల్లి మీదుగా సాంగ్వి గ్రామానికి చేరుకుంటుందన్నారు. అక్కడ అమ్మవారి నగలను గంగనీళ్లతో శుద్ధి చేసి ఆదివారం అడెల్లి గ్రామానికి చేరుకుంటుందన్నారు.

# నెరవేరిన కల..

- బీరవెల్లి కొత్త మండలంతో హర్షం
- తగ్గనున్న దూర భారం

సారంగాపూర్, సెప్టెంబర్ 8 : బీరవెల్లి మండలాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. బీరవెల్లితో పాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కాళ్లరిగేలా తిరిగినా గత పాలకులు పట్టించుకోలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పాలకుల చుట్టు తిరగడమే మానేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. అయితే 2018 జనవరిలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి వచ్చినప్పుడు గ్రామస్తులు బీరవెల్లి మండలాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. మంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం శనివారం బీరవెల్లి కేంద్రంగా నూతన మండలాన్ని ఏర్పాటు చేస్తూ జీవో నంబర్ 223 ప్రకారం ఉత్తర్వులు జారీ చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ఏళ్లనాటి తమ దశాబ్దపు కల నెరవేరిందని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో 32 గ్రామ పంచాయతీలు, 14 ఎంపీటీసీలతో రెండో అతిపెద్ద మండలంగా ఉంది. ఇది వరకు సారంగాపూర్ మండలంలో ఉన్న జౌలి, మల్లక్‌చించోలి, వంజర్, కంకెట, ప్యారమూర్, తాండ్ర(జీ), వైకుంఠపూర్, దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామాన్ని కలుపుకొని బీరవెల్లిని మండలంగా ప్రకటించారు. బీరవెల్లి పరిసర గ్రామాల ప్రజలు ఆయా పనుల కోసం సారంగాపూర్ రావడానికి ఇబ్బందులు పడేవారు. రవాణా సదుపాయం సరిగా లేకుండా పోయింది. రెవెన్యూ, పోలీస్, ఎంపీడీవో, వ్యవసాయ, ఎంఈవో తదితర కార్యాలయాలకు పనుల కోసం సారంగాపూర్ రావడానికి సమయం సైతం వృథా అయ్యేది. తాజాగా బీరవెల్లి మండలం కావడంతో తమ కష్టాలు తీరినట్లేనని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో దూరభారం తగ్గడమే కాకుండా సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయని ప్రజలు పేర్కొంటున్నారు.



నూతనంగా ఏర్పడిన బీరవెల్లి మండలం

### మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని మరువలేం..



అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట ఇచ్చిన ప్రకారం బీరవెల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేయడం జీవితంలో మరిచిపోలేం. సారంగాపూర్ మండలంలో ఉన్నప్పుడు పనుల కోసం మండల కేంద్రానికి రావాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. దీంతో తమకు దూరభారం తగ్గిపోతుంది.

**-కరుణాసాగర్‌రెడ్డి, మండల సాధన కమిటీ అధ్యక్షుడు, బీరవెల్లి**

### పెద్ద మండలం వల్లే ఇబ్బందులు..



సారంగాపూర్ 32 గ్రామ పంచాయతీలు మండలం కావడం వల్లే చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. దీంతో ప్రజల సమస్యలు తీరడం లేదు. చిన్న మండలం ఏర్పడితే అన్ని కార్యాలయాలు ఉంటాయి కాబట్టి ప్రజల సమస్యలతో పాటు పంచాయతీల సమస్యలు వెంటనే పరిష్కారమవుతాయి. బీరవెల్లి మండలాన్ని ఏర్పాటు చేసినందుకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి జీవితాంతం రుణపడి ఉంటాం. **రవీంద్రనాథ్‌రెడ్డి, సర్పంచ్, బీరవెల్లి**

## అవకాశం ఇవ్వండి.. మరింత అభివృద్ధి చేస్తాం



జాదవ్ అనిల్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న జక్కుల మహేందర్

తలమడుగు, అక్టోబర్ 8 : కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదిస్తే బోథ్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని ఉండం, సుంకిడి, కుచులాపూర్, సాయిలింగి గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. గ్రామాల్లోని పలు విధుల గుండా ర్యాలీ తీశారు. కుచులాపూర్ గ్రామానికి చెందిన జక్కుల మహేందర్ ఆధ్వర్యంలో 300 మంది వివిధ పార్టీల కార్యకర్తలు జాదవ్ అనిల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాదవ్ అనిల్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ పథకాలు అమలు చేశారన్నారు. అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, టీఎస్ డీడీసీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## బావిలో పడి యువతి మృతి

ఇంద్రవెల్లి, అక్టోబర్ 8 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం అంజి గ్రామానికి చెందిన దాండేగావ్‌కర్ మోతీరాం, సార్జాబాయి దంపతుల కూతురు రేణుక(18) బావిలో పడి మృతి చెందింది. ఎస్ఐ సునీల్ వివరాల ప్రకారం.. రేణుక నాలుగు సంవత్సరాల నుంచి మతిస్థిమితి కోల్పోయి ఇంట్లోనే ఉంటుంది. పలుమార్లు దవాఖానలకు తరలించి వైద్యం అందించిన ఆరోగ్య పరిస్థితి కుదుట పడలేదు. ఆదివారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన రేణుక గ్రామానికి చెందిన రైతు గారుళే సదాశివ్ వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. గమనించిన రైతు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రేణుక మృతదేహాన్ని పరిశీలించి మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిపై కేసు



గంజాయి మొక్కలతో సీఐ, ఎస్ఐ, తహసీల్దార్

ఉట్నూర్, అక్టోబర్ 8 : ఉట్నూర్ మండలం నర్సాపూర్(జీ) గ్రామ పంచాయతీ పరిధిలోని పెందూర్‌గూడలో గంజాయి సాగు చేస్తున్న ఇద్దరు రైతులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం పెందూర్‌గూడలో ఆడె జుగాదిరావ్ చేనులో 30 మొక్కలు, దుర్వ నాగోరావ్ చేనులో 200 మొక్కలు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గంజాయిని రైతులు సాగు చేస్తే చట్టపరమైన చర్యలో భాగంగా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. సర్కిల్ పరిధిలో ఎవరూ కూడ గంజాయి, మత్తుపదార్థాలు విక్రయించడం, పండించడం నేరమన్నారు. ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ దాడిలో రూ.23లక్షల విలువ గల గంజాయి మొక్కలు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ భుజంగ్‌రావ్, ఎస్ఐ మనోహర్, సిబ్బంది ఉన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయ మూర్తి



అమ్మవారి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

బాసర, అక్టోబరు 8 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సూరెపల్లి నందా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెను అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని విశేష కుంకుమార్చన, సుప్రభాత సేవలో పాల్గొన్నారు. వీరికి అర్చకులు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 8: రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నదని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. పట్టణంలోని అతిపురాతన ఆలయంలో ఒకటైన మంగమఠంలో రూ.50 లక్షలతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఆదివారం భూమి పూజ చేసి శిలఫలాకాన్ని ఆవిష్కరించారు. ఆలయ కమటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

WANTED
jobs

★రామకృష్ణ గ్రూప్ Hyd, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు, బేబి కేర్, ఇంటి/ వంటపని చేయుటకు వర్కర్స్ కావలెను. భో|| + వ|| + జీతం: 15-22 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281452833, 9281452844.
NT-320501-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
నమస్తే తెలంగాణ
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1
GST 5%
91827 77676, 91827 77679
91827 77671, 91827 77677